క్లుప్తంగా

బైరెడ్డిపల్లి ఎంపీపీకి సన్మానం



రెడ్డెప్పను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డా.సునీల్, నేతలు

పలమనేరు: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ అధ్యక్షుడిగా ఎంపికైన బైరెడ్డిపల్లి ఎంపీపీ మొగసాల రెడ్డెప్పను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్, రాష్ట్ర కార్యదర్శులు క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, నేతలు మండీసుధా, చెంగారెడ్డి, దయానందగౌడ, గణేష్‌యాదవ్, చలపతిరెడ్డి, కొండవీటి నాగభూషణం, కోదండరామయ్య, రవి, రమేష్‌రెడ్డి, శశి, భరత్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పలమనేరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ వద్ద శంకర్ నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 25మంది హాజరుకాగా వీరిలో 15మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్టు డా.మురళీకృష్ణ తెలిపారు. వీరికి చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఆపరేషన్లు చేసి మళ్లీ ఇక్కడికి ప్రత్యేక బస్సులో తీసుకురానున్నట్టు ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యలు తెలపండి



ఏఈ మహేంద్రరెడ్డి

పుంగనూరు: ఫెంగల్ తుపాను కారణంగా పట్టణ పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఎదురైనా వెంటనే తమకు తెలియజేయాలని పట్టణ ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుపాను కారణంగా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. విద్యుత్ సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న జిలానీ

బైరెడ్డిపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ జిలానీకి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. పేద ప్రజలు ఆరోగ్య సమస్యలపై ఏ సమయంలో వచ్చినా అందుబాటులో ఉంటూ వారికి కావల్సిన సేవలను అందించారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఆరోగ్యసిబ్బంది అభినందించారు.


కుప్పం సీఓఈకి అవార్డు



సీఓఈకి అందజేసిన సిల్వర్ సర్టిఫికెట్

కుప్పంరూరల్: కుప్పం మండలం, పెద్దబంగారునత్తం వద్ద ఉన్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)కు ఢిల్లీలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ స్కాచ్ రెండవ బహుమతి (సిల్వర్ సర్టిఫికెట్) అందజేసింది. దేశం మొత్తం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న రంగాలకు స్కాచ్ సంస్థ ఏటా అవార్డులను అందజేస్తుంది. ఈ ఏడాది కుప్పం సీఓఈకి ఈ అవార్డు అందజేసినట్లు ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు తెలిపారు. 50లక్షలకు పైగా అంటు కట్టు మొక్కలు రైతులకు అందజేసి రైతులకు సహాయపడినందుకు ఈ అవార్డు వచ్చినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

కార్తీక వనభోజనాలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం అమావాస్య, కార్తీక దీపోత్సవాలు, వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. పుంగనూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు కార్తీక దీపారాధన చేసి, అమావాస్య పూజలు వేడుకగా నిర్వహించారు. ఈసందర్భంగా కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలసి సహపంక్తి వనభోజనం చేశారు.

అసత్యం గ్రహించరా?

- మహిళలకు కూటమి డబ్బులేస్తుందంటూ అసత్య ప్రచారం
- మౌత్ పబ్లిసిటీతో పోస్టాఫీసుల వద్దకు మహిళల పరుగులు
- తుపానులోనూ పోస్టాఫీసుల వద్ద గందరగోళం



పలమనేరు పోస్టాఫీస్ వద్ద ముసురువానలోనూ ఖాతాల కోసం కిక్కిరిసిన మహిళలు

పలమనేరు: రాండక్కో చంద్రన్న మన ఆడోళ్లకు ఒకరికి రూ.15వేలు ఖాతాలోకి జమ చేస్తారంటూ పోస్టాఫీస్‌లో ఖాతా ఉండాలనే తప్పుడు ప్రచారంతో వందలాది మంది మహిళలు తుపానులో వర్షం పడుతున్నా పోస్టాఫీసు వద్దకు చేరుకుంటున్నారు. ఖాతాలు తెరిచేందుకు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే ఈ అమాయక జనానికి అసలు నిజాలు తెలియదా అని వీరిని చూసిన జనం అనుకుంటున్నారు. పలమనేరు హెడ్ పోస్టాఫీసు వద్ద గత మూడు రోజులుగా మహిళలు క్యూలో నిలబడి ఖాతాలను తెరిచేందుకు వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ తప్పుడు ప్రచారం ఎవరు చేశారోగానీ సాక్షాత్తు పోస్టల్ అధికారులే డబ్బులు వేసేందుకు కాదని చెబుతున్నా మీకెందుకు సార్ మా అకౌంట్ ఓపెన్ చేసేయండి చాలంటూ బారులు తీరుతున్నారు. పోతేపోనీలే ఇలాగైనా పోస్టల్ అకౌంట్లు పెరిగితే చాలని వారు సైతం ఖాతాలను ఓపెన్ చేసుకుంటున్నారు.

మీకు రూ.15వేలు, మీకు 15వేలు, మీకు 18వేలు వీడియోలు చూసి

కూటమి సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఏ పథకం కావాలన్నా పోస్టాఫీసుల్లో ఖాతాలుండాలంటూ వీరికి ఎవరు ప్రచారం చేశారోగాని మహిళలు పోస్టాఫీసుల బాట పట్టారు. బ్యాంకు ఖాతా ఉన్నప్పటికీ పోస్టాఫీసుల్లో అకౌంట్ ఉంటేనే డబ్బులు పడతాయనే ప్రచారం విపరీతంగా మౌత్ పబ్లిసిటీ అయింది. దీంతో ఒకరి నుంచి మరొకరు ఈ విషయాన్ని చెప్పుకొని భారీ ఎత్తున మహిళలు పోస్టాఫీసుల్లో ఖాతాల కోసం రూ.300 చెల్లించి ఖాతాలను తెరుస్తున్నారు.

అసలు విషయం ఏమిటంటే...

చాలా మందికి బ్యాంకు ఖాతాలున్నప్పటికీ ఐపీపీబీ(ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు) అనుసంధానం జరగలేదు. దీంతో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు లింకు లేకుండా పోయింది. అలాంటి వాళ్లు పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిస్తే కేంద్ర ప్రభుత్వ పథకాలు వస్తాయనే విషయం ఇటీవల సాంఘిక మాధ్యమాల్లో వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం తమకు నగదు ఇవ్వాలంటే పోస్టాఫీసుల్లో డబ్బు పడుతుందని ఇంత మంది క్యూకడుతున్నట్టు సమాచారం. ఏదేమైనా తప్పుడు ప్రచారం కారణంగా నియోజకవర్గంలోని అన్ని పోస్టాఫీసులు వద్ద వర్షంలోనూ మహిళలు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. మరోవైపు ఎలాగూ తమ పోస్టల్ ఖాతాలు టార్గెట్‌లకు మించి వస్తున్నందున ఆ శాఖ అధికారులు సైతం లోలోపల ఆనందపడుతున్నట్టు పోస్టల్ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

వరి పంట ధ్వంసం

- తొక్కి నాశనం చేసిన గున్న ఏనుగులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు గ్రామానికి చెందిన బాలాజీనాయుడుకు చెందిన వరి పంటను శనివారం రాత్రి రెండు గున్న ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. వర్షం కారణంగా ఇప్పటికే నేలవాలిన వరిని ఏనుగులు నాశనం చేశాయంటూ బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతోపాటు అడవిపందులు కూడా పంటను నాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం





విజలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, పుంగనూరు: ర్యాలీలో వైద్య సిబ్బంది

రామకుప్పం: మండలంలోని విజలాపురం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పూజిత మాట్లాడుతూ ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించాలన్నారు. హెచ్‌ఐవీ నివారణ నాది, నీది, మనందరిది అన్నారు. హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. హెచ్‌ఐవీ సోకిన వారిని దూరం పెట్టడం కాదు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పుంగనూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో డాక్టర్లు, సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌ను నివారించేందుకు జాగ్రత్తలు అవసరమని అన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుమ: హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా సూచించారు. మండల కేంద్రంలో ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని చెప్పారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి సోకకుండా చూడవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్, ఎయిడ్స్ కౌన్సిలర్ బాలాజి పాల్గొన్నారు.

నక్కబండలో ఆస్తి పన్ను విధిస్తాం

– కమిషనర్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోకి కొత్తగా చేరిన నక్కబండ, మంగళం కాలనీ ప్రాంతాలలో ప్రజలు తమ గృహాలకు సంబంధించి సరైన రికార్డులతో దరఖాస్తు చేసుకుంటే ఆస్తి పన్నులు విధించి, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన చేస్తామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసి, ప్రజల సమస్యలు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా నక్కబండలో ఆస్తి, నీటి పన్ను విధించేందుకు గృహ యజమానులు తమ రికార్డులతో దరఖాస్తు చేయాలన్నారు. నక్కబండ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాల కోసం తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించి పనులు చేపడుతున్నామని ఈ సందర్భంగా తెలిపారు. విస్తరణ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆయా సచివాలయ కార్యదర్శులు, ఆ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలపై నివేదిక అందజేయాలని కమిషనర్ తెలిపారు.

నిండుతున చెరువులు



పులిచెర్ల: చెరువుల్లోకి చేరుతున్న నీరు

పులిచెర్ల(కల్లూరు): ఫెంగల్ తుపాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. ఇప్పటి వరకు చుక్కనీరు లేక పలు చెరువులు బోసిపోయి ఉన్నాయి. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి ప్రస్తుతం ప్రతి చెరువులో నీరు చేరింది. అయితే రోజూ కురుస్తున్న వర్షాలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

సదుంలో ముసురు వర్షం



సదుం: నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్



గార్గేయలో వరద నీటి ప్రవాహం

సదుం: తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో ముసురు వర్షం కురుస్తోంది. సాధారణ జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. గార్గేయ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. 35 ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందిందని ఏఓ హరిప్రసాద్ చెప్పారు. చల్లావారిపల్లె ఫీడర్ పరిధిలో మూడు విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలినట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.



వర్షానికి నేలవాలిన వరి



మొసలిమడుగు వద్ద నేలవాలిన వరి

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు గ్రామంలో తుపాను కారణంగా పలువురు రైతులకు చెందిన వరి పంట నేలవాలింది. ఇదేవిధంగా మరో నాలుగు రోజులు వాన పడితే వరి పంట ఎందుకూ పనికి రాకుండాపోతుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా ఉప్పు ద్రావణాన్ని చల్లి రైతులు నేలవాలిన పంటను రక్షించుకోవాలని స్థానిక ఏఓ సంధ్యారాణి సూచించారు.

నష్టం మిగిల్చిన ఫెంగల్

- 3 ట్రాన్స్‌ఫార్మర్లు, 4 విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- నేలకొరిగిన వరిపంట



కోటూరు వద్ద నేలకొరిగిన వరి పంట

చౌడేపల్లె: గత రెండు రోజులుగా ఫెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతుల ఆశల్లో విషాదం నింపింది. మండలంలో ఆదివారం విపరీతమైన గాలులతో కూడిన ఎడతెరిపిలేని వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. పంటలు చేతికందే సమయంలో వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గాలులకు చారాల, కోటూరు, గాజులవారిపల్లె గ్రామాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. వరి పంట నేలకొరగడంతో వర్షపు వరదనీరు పంటలపై పారుతోంది. వరి, టమాట, బీన్స్, కాలీఫ్లవర్ పంటలకు నష్టం వాటిల్లింది. కమాండ్ కంట్రోల్ రూము ద్వారా వీఆర్‌ఓ శ్రీపతిరెడ్డి వర్షపాతం ప్రభావంతో జరిగిన నష్టాల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలిపారు.

ఏటి చెరువుకు జలకళ

- ఆందోళనలో రైతన్నలు
- చెరువు మొరవకు పడిన లీకేజీ
- లీకేజీని పరిశీలించిన అధికారులు
- భయాందోళనలో రైతులు



ఏటి చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: తలకోన అడవుల నుంచి పింఛా నదికి ప్రవహించే కప్పులేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీటికి రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామ పంచాయతీలోని ఏటి చెరువు నిండి మొరవపోతోంది. అయితే ఏటి చెరువు మొరవకు లీకేజీ ఏర్పడిందని రైతులు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఇరిగేషన్ అధికారులతో కలసి ఏటి చెరువును పరిశీలించారు. చెరువుకు నీటి ఉధృతి ఎక్కువ అయితే లీకేజీ ఎక్కువై చెరువు మొరవకు గండి పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అధికారులు రాత్రి పూట అక్కడే ఉండి పరిశీలించాలని తెలియజేశారు. లీకేజీని అరికట్టేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు అందరూ అధికారులకు సహకరించాలన్నారు. రొంపిచెర్ల మండలంలో ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు 96.2 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారులు అందరూ గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. ఆయన మండల శాఖ అధికారులతో తుపానుపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో గుడిసెల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. డీటీ లోకేష్, ఏఎస్ఓ రాజేశ్వరి, ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్, పశువైద్యాధికారి శ్రీధర్, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం





అక్కనపల్లె నుంచి శెట్టిపల్లెకు వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపునీరు, కైగల్ నుంచి రామసముద్రం రోడ్డు

- కనీసం మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బైరెడ్డిపల్లె నుంచి పాతపేటకు వెళ్లే రోడ్డు దుస్థితి

బైరెడ్డిపల్లె: వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు చాలా వరకు మండల పరిధిలో దుస్థితికి చేరుకున్నాయి. ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనేందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు గుంతలమయమైన రహదారులు. బైరెడ్డిపల్లె కేంద్రం నుంచి పాతూరునత్తం, పాతపేట, కుప్పనపల్లె, టీఎన్ కుప్పం, కడపనత్తం, గొనితిమ్మేపల్లె గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అడుగుకో గుంత దర్శనమిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైగల్ నుంచి ఎంకొత్తూరు, రామసముద్రం, సన్నిపల్లె, మునిపల్లెకు, లక్కనపల్లె నుంచి శెట్టిపల్లె, చిక్కనపల్లె, బురిశెట్టిపల్లె గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతనే. గత టీడీపీ ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టి కంకర వేసి రహదారి పనులు పూర్తిచేయకుండా వదిలిపెట్టారు. ఇప్పటికీ అలాగే ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కమ్మనపల్లె నుంచి ఎర్రకదిరేపల్లె, గోపాలపురం, జోగిండ్లు, గడ్డిండ్లు గ్రామాలతో పాటు పెద్దపురం, పెద్దచల్లారగుంట, గాజీపేట, ఆల్లపల్లె, మునిరాజపురం గ్రామాలకు వెళ్లే రహదార్లు కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరీ దారుణంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. రాకపోకలకు బాటసారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ ఏ గుంతలో పడతామో అనే భయంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లకు అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షపునీరు గుంతల్లో చేరడంతో రాత్రి వేళల్లో నడిరోడ్డులో ఉన్న గుంతలను గమనించకుండా వెళ్లి వాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులను ఆరు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామని చెప్పినా ఇంతవరకు పనులు మొదలు పెట్టకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులకు టార్పాలిన్ కష్టాలు



రైతులకు ఉపయోగకరంగా మారిన టార్పాలిన్లు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన టార్పాలిన్లు(ఫైల్)

- గత ప్రభుత్వంలో రాయితీపై టార్పాలిన్లు
- వీటిని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రైవేటు వారి వద్ద అధికంగా ధరలు
- విధిలేక కొంటున్న రైతులు

పలమనేరు: వర్షాలు, తుపానులు వచ్చాయంటే రైతులు పండించిన పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు టార్పాలిన్ల అవసరం ఎంతైనా ఉంది. వరి నూర్పిళ్ల నుంచి, ధాన్యం నిల్వలు, పశుగ్రాసం ఇలా వ్యవసాయ ఉత్పత్తులు వానకు తడవకుండా రక్షణగా టార్పాలిన్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. గత ప్రభుత్వం రైతులకు అవసరాలను గమనించి టార్పాలిన్లను 50శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటి గురించి అసలు పట్టించుకోలేదు. అసలే తుపానుల కాలం, దీనికితోడు వరి పంట కోతలు, ఒబ్బిళ్ల వేళ పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు టార్పాలిన్ల అవసరం ఎక్కువైంది. ప్రభుత్వం సాయం చేయకపోవడంతో అధిక ధరలను పెట్టి రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద టార్పాలిన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతుల అవసరంతో పెరిగిన ధరలు

వర్షాల కారణంగా టార్పాలిన్ల అవసరం ఉందని గమనించిన వ్యాపారులు సైతం వీటి ధరలను అమాంతం పెంచేశారు. ప్రస్తుతం పలమనేరు ప్రాంతంలో 8కి 8 టార్పాలిన్ ధర రూ.1,500, 18కి 24 ధర రూ.2,500, 24కి 30 ధర రూ.3,200 దాకా అమ్మకాలు సాగిస్తున్నారు. ధరలు ఎంతున్నా అవసరం కాబట్టి రైతులు సైతం వీటిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే గత ప్రభుత్వం లాగా ఈ ప్రభుత్వం సైతం సబ్సిడీతో టార్పాలిన్లను పంపిణీ చేసుంటే కష్టాలు తప్పేవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముసురు వర్షాలకు టార్పాలిన్లే దిక్కు

తుపానులు, ముసురు వర్షాల కారణంగా ఇప్పటికే ఒబ్బిళ్లు చేసిన ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలంటే టార్పాలిన్లు ఉండాల్సిందే. ఇదే కాకుండా వరి గడ్డి, పశువుల పాకలు, పొలాల వద్ద రైతుల ఉత్పత్తులు, ధాన్యాన్ని ఎండబెట్టుకోవాలన్నా ఇవి ఉండాల్సిందే. ఏదేమైనా కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన పథకాలను అమలు చేయకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.